సాక్షి
రంగారెడ్డి

మంగళవారం । 29 । జూలై । 2025



సమస్యల పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ అన్నారు. 8లో▸



కంచిమోనిగూడ వద్ద

న్యూస్‌రీల్

ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వండి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

ఇబ్రహీంపట్నం రూరల్ : ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో డీఆర్‌ఓ సంగీతతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులకు సంబంధిత అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, పరిష్కరించాలని సూచించారు. ఈ వారం మొత్తం 76 ఫిర్యాదులు వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

రోస్టర్ పాయింట్లు సవరించాలి

చేవెళ్ల: ఎస్సీ వర్గీకరణ, రోస్టర్‌పాయింట్ల కేటాయింపులో మాలలకు జరిగిన అన్యాయంపై స్పందించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసంపూర్ణ రోస్టర్ విధానంతో మాల, మాల అనుబంధ కులాలుగా ఉన్న గ్రూప్3 వారికి తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రోస్టార్ పాయింట్ల విధానాన్ని సవరించాలని, అప్పటి వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు షాద్‌నగర్ డివిజన్ ఉపాధ్యక్షుడు సున్నపు నరసింహ, విద్యార్థి విభాగం డివిజన్ నాయకుడు కమ్మరి మల్లేశ్, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు శేఖర్, షాద్‌నగర్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన గోలి శ్రీనివాస్‌రెడ్డి



ఆమనగల్లు: మాజీమంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ నందినగర్‌లో ఉన్న కేటీఆర్ నివాసంలో ఆయనను కలిసి సత్కరించారు.

భారం ఉన్నప్పటికీ పథకాల కొనసాగింపు



కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి, కాలె యాదయ్య

శంకర్‌పల్లి: ప్రభుత్వంపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలన్నింటినీ కొనసాగిస్తున్నట్లు మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు గార్డెన్స్‌లో సోమవారం చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, ఆర్డీఓ చంద్రకళతో కలిసి లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు రాలేదని ఎవరూ అధైర్య పడాల్సిన పని లేదని, నిజమైన నిరుపేదలకు కచ్చితంగా ఇచ్చి తీరుతామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం నడుస్తోందని, పథకాల విషయంలో ఎవరూ ఆందోళన చెందొద్దని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోవిందమ్మ, వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్, ఎంపీడీఓ వెంకయ్య, డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిష్కార మార్గం ఏదీ!

గుంతలు పడి.. కంకర తేలి

ఏకధాటి వర్షాలు.. ఓవర్‌లోడ్‌తో భారీ వాహనాల రాకపోకలు.. మరమ్మతుల్లో ఏళ్లుగా నిర్లక్ష్యం.. వెరసి రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. భారీగా గుంతలు ఏర్పడటం, నిండా వర్షపు నీరు నిల్వ ఉండటం, రాత్రిపూట తెలియక వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ఒళ్లు హూనమవుతోంది. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వెహికిల్స్ దెబ్బతింటున్నాయి.

- అధ్వానంగా రహదారులు
- తరచూ ప్రమాదాలు
- దెబ్బ తింటున్న వాహనాలు
- పట్టించుకోని అధికారులు



మొయినాబాద్ రూరల్: వర్షానికి దెబ్బతిన్న బాకారం- నాగిరెడ్డి గూడెం రోడ్డు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రోడ్లు భవనాలశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 1,166.629 కిలోమీటర్ల పొడవు రోడ్లు ఉన్నాయి. వీటిలో 66.50 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులు, 706.365 కిలోమీటర్లు జిల్లా ప్రధాన రహదారులు, 393.714 కిలోమీటర్ల గ్రామీణ రోడ్లు ఉన్నాయి. జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 3,731.92 కిలోమీటర్ల రోడ్లు ఉండగా, వీటిలో 234 కిలోమీటర్లు సీసీ, 1,678 కిలోమీటర్లు కంకర, 578 కిలోమీటర్ల మొరం, 908 కిలోమీటర్ల మట్టి రోడ్లు ఉన్నాయి. భారీ వాహనాల రాకపోకలతో ఇప్పటికే దెబ్బతిన్న ఆయా రోడ్లన్నీ తాజా వర్షాలతో మరింత అధ్వానంగా తయారయ్యాయి. ఎక్కడికక్కడ కంకర తేలి ప్రమాదకరంగా మారాయి. రాత్రిపూటే కాదు పగలు సైతం వీటిపై ప్రయాణించేందుకే జంకుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉండటం, అదే మార్గంలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో పూర్తిగా బురదమయంగా మారుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు జారిపడి తీవ్రంగా గాయపడుతున్నారు.



మొయినాబాద్: కనకమామిడి వద్ద రహదారి పరిస్థితి

నాట్లువేసి.. బైఠాయించి నిరసన

దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని స్థానికులు తరచూ ఆందోళనలకు దిగుతున్నారు. ఎప్పటికప్పుడు ఆయా మార్గాల్లో పర్యటించి, దెబ్బతిన్న రోడ్లకు మరమత్తులు నిర్వహించాల్సిన రోడ్లు భవనాలశాఖ, పంచాయతీరాజ్‌శాఖ ఇంజనీర్లు ఆఫీసు గడపదాటి బయటికి వెళ్లడం లేదనే విమర్శలు లేకపోలేదు. కొత్త రోడ్లకు ఎస్టిమేషన్లు వేయడం, కమీషన్లు తీసుకోవడం మినహా చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. పర్యవేక్షణ లోపంతో వేసిన రోడ్లు సైతం కొద్ది రోజులకే పాడవుతున్నాయి.

మచ్చుకు కొన్ని..

- మీర్‌ఖాన్‌పేట్-మైలారం చౌరస్తా గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై మహిళలు ఇటీవల నాట్లు వేసి నిరసన తెలిపారు.
- శంకర్‌పల్లి మండలం ఫత్తేపూర్ రోడ్డుకు పునరుద్ధరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ నిర్వాహకులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.
- చౌదరిగూడ మండలం రాంజాతండా, నంద్యతండా, లచ్చంపేట, వీరసముద్రం, లక్ష్మీదేవిపల్లి గ్రామాలకు ఇప్పటికీ మట్టి రోడ్లే దిక్కువుతున్నాయి.
- గ్రామీణ రోడ్లు మాత్రమే కాదు చేవెళ్ల, శ్రీశైలం, నాగార్జునసాగర్, విజయవాడ జాతీయ రహదారులు సైతం అధ్వానంగా తయారయ్యాయి.

పట్టించుకోవడం లేదు

ఇటు శ్రీశైలం జాతీయ రహదారి నుంచి అటు వావిళ్లకుంట వరకు 200 అడుగుల రోడ్డు వేశారు. తర్వాత ఉన్న లింకు రోడ్డును మూడేళ్ల క్రితం తవ్వి వదిలేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. ఈ రోడ్డుపై నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పటికే రోడ్డు పూర్తిగా ధ్వంసం అయింది. వర్షానికి గుంతల్లో భారీగా నీరు చేరి మరింత ప్రమాద కరంగా మారింది. అధికారులు పట్టించుకోవడం లేదు.

– రవి, మీర్‌ఖాన్‌పేట్



వెంకటాపూర్ వద్ద



కనకమామిడి వద్ద

టవర్.. షివర్

అసలే వర్షాకాలం.. విద్యుత్ ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువ.. కరెంట్ తీగలకు చెట్ల కొమ్మలు, తీగలు ఏవి తగిలినా షాకే. అలాంటి వాటిని విద్యుత్ అధికారులు, సిబ్బంది గుర్తించి వెంటనే తొలగించాల్సి ఉండగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. మొయినాబాద్ మండలం కనకమామిడి 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి షాబాద్ మండలం హైతాబాద్ వరకు టవర్లకు తీగలు ఇలా అల్లుకున్నాయి. ఎప్పుడేం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు.

– మొయినాబాద్

31న కాంగ్రెస్ పాదయాత్ర

పరిగి: కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పాదయాత్ర, శ్రమదానం కార్యక్రమాలకు వికారాబాద్ జిల్లా పరిగి నుంచి శ్రీకారం చుట్టనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ ఇక్కడికి రానున్నారని వెల్లడించారు. ఈనెల 31న (గురువారం) ప్రారంభమయ్యే పాదయాత్ర మొదటి రోజు రంగాపూర్ నుంచి పరిగి వరకు కొనసాగుతుందని చెప్పారు. రాత్రి ఇక్కడే బస చేసి, మరుసటి రోజు ఉదయం 11 గంటలకు శ్రమదానం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నాయకులతో సమీక్ష ఉంటుందని తెలిపారు.

నేడు వికారాబాద్‌కు మంత్రి తుమ్మల

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శివారెడ్డిపేట సమీపంలో మంగళవారం చేపట్టనున్న ఆయిల్ పాం ప్లాంటేషన్ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. స్పీకర్ ప్రసాద్ కుమార్‌తో కలిసి మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆవిధంగా వెళ్లారు

చిన్నపాటి నిర్లక్ష్యాలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా కొంతమంది కళ్లు తెరవడం లేదు. శంకర్‌పల్లిలో ఓ మహిళ సోమవారం తన ద్విచక్రవాహనంపై ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. మరో ఐదుగురితో (మైనర్లు) కలిసి ఇలా ప్రయాణం సాగించింది. రోడ్డుపై వెళ్లే వాళ్లంతా వారినే చూస్తూ ఏంటీ పిచ్చి పనులు అనుకుంటూ వెళ్లారు.

– శంకర్‌పల్లి



పెండింగ్ బిల్లులు ఇవ్వండి

మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ఇబ్రహీంపట్నం రూరల్: పది నెలలుగా రావాల్సిన కోడిగుడ్ల బిల్లులు తక్షణమే చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు యెలమోని స్వప్న డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పది నెలలుగా కోడిగుడ్ల బిల్లులు చెల్లించకపోవడంతో కార్మికులు అప్పు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ప్రభుత్వమే వంటగ్యాస్ ఇవ్వాలని, వంట గది లేని చోట నూతనంగా నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, గుర్తింపు కార్డులు, డ్రెస్‌కోడ్, భద్రత బెనిఫిట్స్ వంటివి కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రూ.10 వేల వేతనం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక మాట తప్పిందని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించకుంటే వచ్చేనెల 6న జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో వంట బందు పెట్టి విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎల్లేశ, పెంటయ్య, గణేశ్, పద్మ, రాధ, రమాదేవి, జయమ్మ, అంజమ్మ, శిరీష, సుధాకర్, రాజేష్, నరేందర్, యాదమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటి ముట్టడి



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఇంటి వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఫార్మాసిటీ భూ బాధిత రైతులు

- ఫార్మాసిటీ బాధిత రైతుల ఆందోళన
- ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్
- సీఎం దృష్టికి తీసుకెళ్తానని మల్‌రెడ్డి హామీ

యాచారం: నగరంలోని తిరుమల హిల్స్‌లో ఉన్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఇంటిని సోమవారం ఫార్మాసిటీ బాధితులు ముట్టడించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన ప్లకార్డులను చేతబట్టి ఆందోళన నిర్వహించారు. యాచారం మండలం నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన దాదాపు 250 మందికి పైగా ఉదయాన్నే ఎమ్మెల్యే ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేసి, రైతుల భూములను తిరిగి వారి పేరున నమోదు చేస్తామని చెప్పారన్నారు. ఫార్మాసిటీ కోసం తమ పట్టా భూములను ఇవ్వకపోవడంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరిహారాన్ని అథారిటీలో జమ చేసిందని మండిపడ్డారు. ఆతర్వాత రికార్డుల్లో తమ వివరాలను తొలగించి, టీజీఐఐసీ పేరున మార్చారన్నారు. పరిహారంలో భాగంగా ఇటీవల ప్లాట్లను సైతం కేటాయించారని తెలిపారు. ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వంతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు.

సీఎంతో మాట్లాడుతా

ఆందోళనకారులను ఉద్దేశించి ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీని రద్దు చేసి, ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై సీఎంతో చర్చించి న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. భూసేకరణ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున తానేమీ మాట్లాడలేనని చెప్పారు. బాధిత రైతుల తరఫున ఓ ప్రతినిధి బృందం పూర్తి వివరాలతో వస్తే కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

‘మహా’ ఆదరణ



బస్సు ఎక్కుతున్న మహిళలు (ఫైల్)

ఆర్టీసీకి మహాలక్ష్మి కళ

- 1.62 కోట్లు దాటిన మహిళా ప్రయాణికులు
- షాద్‌నగర్ డిపోకు సమకూరిన రూ.7.43 కోట్లు

షాద్‌నగర్: ఆర్టీసీ బస్సులు మహిళా ప్రయాణికులతో కళకళలాడుతున్నాయి. మహాలక్ష్మి పథకంలో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఫలితంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకానికి మహిళల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.

ప్రైవేటు నుంచి ఆర్టీసీ వైపు

కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబర్ 9న ఆర్టీసీలో మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. పథకంలో భాగంగా మహిళలకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. గతంలో ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించే వారు ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల వైపు మళ్లారు. ఆక్యుపెన్సీ రేషియో బాగా పెరిగింది. ప్రభుత్వం ఉచిత బస్సు సొమ్మును ఆర్టీసీకి చెల్లిస్తుండటంతో సంస్థ ఆర్థిక లేమి నుంచి బయటపడుతోంది.

అవసరమైన రూట్లలో ప్రత్యేక బస్సులు

మహాలక్ష్మి పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు షాద్‌నగర్ డిపోలో కోటి 62లక్షలకుపైగా మంది మహిళా ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణించారు. సగటున నెలకు 8.52 లక్షల మంది ప్రయాణం సాగించారు. దీని ద్వారా ప్రభుత్వం నుంచి డిపోకు రూ.7.43 కోట్ల ఆదాయం వచ్చింది. సరాసరి నెలకు రూ.39 లక్షలపైనే సమకూరింది. షాద్‌నగర్ నుంచి మహబూబ్‌నగర్, హైదరాబాద్ రూట్లలో ప్రతీ రోజు రద్దీ ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు. పండగులు, సెలవు రోజుల్లో రాకపోకలు అధికంగా ఉంటాయని, రద్దీకి అనుగుణంగా అవసరమైన రూట్లలో ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు చెప్పారు.

ఎంతో ప్రయోజనం



ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం హర్షణీయం. పేద, మధ్య తరగతి వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

– గౌతమి, షాద్‌నగర్

ఆర్థిక భారం తగ్గింది



గతంలో ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించే వాళ్లం. ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తున్నాం. ఆర్థిక భారం తగ్గింది.

– ప్రభ, షాద్‌నగర్

భారీగా ఆదాయం



మహాలక్ష్మి పథకం ప్రారంభమైనప్పటి నుంచి బస్సుల్లో రద్దీ పెరిగింది. సంస్థకు భారీగా ఆదాయం సమకూరింది.

– ఉష, డిపో మేనేజర్, షాద్‌నగర్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఎస్.ఎం.ఇ. శాఖ- 16292 ప్లాటు నెం.95, ... కాలనీ, ఎయిర్ బైపాస్ రోడ్డు, తిరుపతి - 517502, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

స్వాధీనతా ప్రకటన(లాంఛనంగా) రూల్ నెం.8(1) క్రింద (స్థిరాస్తి కోసం)

ఖాతా నెం. 40424450657 (...)

[illegible] ... 07.05.2025 ... 21.05.2025 ... రూ.5,69,97,649.00 ... 28.07.2025 ... రూ.5,69,97,649.00 ... స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్.ఎం.ఇ. శాఖ, తిరుపతి ... [illegible]

[illegible] ... విక్రయ పత్రం నెం.2037/2001, తేది: 22.10.2001 ... విక్రయ పత్రం నెం.2038/2001, తేది: 22.10.2001

తిరుపతి, తేది: 28.07.2025 సం॥ అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం


వెంకటేశ్ (ఫైల్)

శంకర్‌పల్లి: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ యువకుడు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పర్వేద గ్రామానికి చెందిన చాకలి బుచ్చయ్యకి కుమారుడు వెంకటేశ్ (24) ఉన్నాడు. గ్రామ శివారులోని ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కుటుంబంలో అప్పులు అధికమయ్యాయి. తండ్రీకొడుకుల మధ్య తరచూ వాగ్వాదాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో ఆదివారం అవి తారాస్థాయికి చేరడంతో మనస్తాపానికి గురైన వెంకటేశ్.. అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులపై కేసులు

శంషాబాద్: ఆర్‌జీఐఏ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల నమోదైన 33 కేసుల్లో ఒకరి జైలు శిక్షతో పాటు మిగతా వారిని నుంచి జరిమానా వసూలు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిలో ఓ వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష, రూ. 2 వేల జరిమానాను కోర్టు విధించిందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 17 మంది నుంచి రూ. 50 వేలు జరిమానా, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారి నుంచి రూ. 32 వేల జరిమానా వసూలు చేశారమన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఉల్లంఘనులపై చట్టపరమైన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

CHANGE OF NAME

I, **THOTA ANUSHA W/o ABDUL HAMEED, D/o. THOTA RAGHAVA RAO,** R/o. Flat No.404, 4th Floor, Happy Homes Fortuna, Upperpally, Attapur, Rajendranagar Mandal, Ranga Reddy District - 500048, Telangana. I further declare before Marriage my name is **THOTA ANUSHA,** but after Marriage I have changed my name as **AASIYA** instead of **THOTA ANUSHA.** But I am continuing the old name only i.e., **THOTA ANUSHA** for the purpose of official use.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్ఐ సుశీల కథనం ప్రకారం.. మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామ శివారులోని ఐడియల్ స్కూల్ ఎదురుగా ఉన్న వెంచర్‌లో సోమవారం గుర్తు తెలియని మహిళ (45) మృతదేహం కుళ్లిన స్థితిలో కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి వివరాలు తెలియరాలేదు. ఎవరైనా హత్యచేసి ఇక్కడ పడవేసి ఉంటారా, లేక ఆత్మహత్యకు పాల్పడిందా అనే కోణంలో విచారణ చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

రాజేంద్రనగర్: ఇంట్లోని ఫ్రీజ్ ఓపెన్ చేసేందుకు ప్రయత్నించిన ఓ మహిళ విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన ఎర్రబోడ ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రబోడ ప్రాంతానికి చెందిన పి.లావణ్య (40) భర్త మృతి చెందడంతో ముగ్గురు పిల్లలతో కలిసి ఉంటోంది. సోమవారం ఉదయం ఫ్రిజ్ తెరిచేందుకు వెళ్లగా విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు ఆమెను ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు మేకలు అపహరణ

దోమ: గుర్తు తెలియని దుండగులు ఆరు మేకలు అపహరించిన సంఘటన దిర్సంపల్లి తండాలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కేతావత్ గేమ్యానాయక్ మేకలు సాకుతూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం మేకలు మేపి పాకలో తోలి ఇంటికి వెళ్లాడు. ఉదయం వచ్చి చూడగా ఆరు మేకలు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. రూ.లక్ష నష్టపోయానని ఆవేదన వ్యక్తంచేశాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

అభయహస్తం

సంక్షేమ పథకాల అమలుపై దృష్టిసారించిన ప్రభుత్వం

- ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ పనులు వేగిరం
- చురుగ్గా రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ
- మహిళలకు ఉచిత ప్రయాణం, సబ్సిడీపై సిలిండర్లు
- స్థానిక నేతల'అభివృద్ధి పర్యటనలు'



వికారాబాద్: స్థానిక ఎన్నికలకు కసరత్తు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, సంక్షేమంపై ఫోకస్ పెట్టింది. అభయహస్తం హామీలో భాగంగా ఆరు పథకాలపై దృష్టిసారించింది. ప్రధానంగా రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఉచిత విద్యుత్, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్ వంటి వాటిపై ప్రత్యేక నజర్ పెట్టింది. వీటిని లబ్ధిదారులకు అందించే పనుల్లో యంత్రాంగం తలమునకలైంది. భూభారతి సమస్యల పరిష్కారంపై కూడా స్పెషల్ ఫోకస్ పెట్టారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆయా శాఖల హెచ్ఓడీలు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో పాటు మంత్రులు శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క, పొంగులేటి, కొండా సురేఖ, చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి ఎమ్మెల్యేలతో కలిసి జిల్లాలో పర్యటిస్తూ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారు. స్థానిక పోరులో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

22,503 కొత్త కార్డులు

ప్రజా పాలన కార్యక్రమంతో పాటు ఆన్‌లైన్‌లో 35వేల పైచిలుకు కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. వీటిపై క్షేత్ర స్థాయి విచారణ చేపట్టిన అధికారులు అర్హుల జాబితాను ప్రభుత్వానికి అందించారు. ఇప్పటి వరకు 22,503 కుటుంబాలకు ప్రభుత్వం కార్డులు మంజూరు చేసింది. దీనికితోడు పాత కార్డులలో కొత్త సభ్యుల వివరాల నమోదు, తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు 70,685 కొత్త సభ్యులు రేషన్ కార్డుల్లో చేరారు. జిల్లాలో మొత్తం 2,75,224 రేషన్ కార్డుల ద్వారా 9,91,562 మంది సభ్యులకు సన్న బియ్యం సరఫరా అవుతున్నాయి.

11,785 ఇందిరమ్మ ఇళ్లు

ఇందిరమ్మ పేరుతో రూ.5 లక్షల నిధులతో ప్రభుత్వం పేదలకు ఇళ్లు మంజూరు చేస్తోంది. తొలి విడతలో ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసింది. వీటిలో 11,785 గృహాలకు మంజూరు పత్రాలు అందజేయగా 5,506 ఇళ్లకు హౌసింగ్ అధికారులు మార్కింగ్ చేశారు. వీటిలో 605 బేస్మెట్ లెవెల్, 70 రూఫ్‌లెవల్‌లో ఉండగా 25 ఇళ్లకు స్లాబ్ పనులు పూర్తి చేశారు. ఆయా స్థాయిలలో 438 మంది లబ్ధిదారులకు నిధులు విడుదలయ్యాయి.

1,16,990 గ్యాస్ కనెక్షన్లు

జిల్లాలో మొత్తం 2,08,553 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో జనరల్ కనెక్షన్లు 19,358 (డబుల్), 69,902(సింగల్), 3,209 కమర్షియల్, 35,193 దీపం, 38,753 ఉజ్వల్, 21,260 సీఎస్ఆర్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో తెల్ల రేషన్ కార్డు కలిగిన 1,16,990 మందికి మహాలక్ష్మి పథకం కింద రూ.500 సిలిండర్ అందుతోంది.

మహిళలకు ఉచిత ప్రయాణం..

జిల్లాలోని పరిగి, తాండూరు, వికారాబాద్ డిపోల పరిధిలోని ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తున్నారు. మూడు డిపోల్లో కలిపి ఇప్పటివరకు 3.98 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు. ఇందుకుగానూ ప్రభుత్వం రూ.142 కోట్లు ఖర్చు చేసింది.

రైతుకు భరోసా...

జిల్లాలోని మొత్తం 539 రెవెన్యూ గ్రామాలు, 20 మండలాల పరిధిలో 3,18,447 మంది రైతులు ఉన్నారు. వీరికి ఏడాదికి ఎకరానికి రూ.12,000 చొప్పున రైతు భరోసా నిధులు జమచేస్తోంది. ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి ఎకరానికి రూ.6 వేల చొప్పున 2,71,785 మంది రైతులకు రూ.358,17,08, 533 ఖాతాల్లో జమచేసింది.

నిరంతర ప్రక్రియ



ప్రభుత్వ పథకాల అమలు నిరంతర ప్రక్రియ. అర్హులైన వారికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు,గృహజ్యోతి, ఆర్టీసీ ఉచిత ప్రయాణం తదితర పథకాలన్నీ అందుతాయి. దరఖాస్తు చేసుకున్న వెంటనే క్షేత్ర స్థాయి అధికారులతో విచారణ పూర్తి చేయించి, లబ్ధిదారులకు అందేలా చూస్తున్నాం.

– ప్రతీక్‌జైన్, కలెక్టర్

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి


ఉపాధ్యాయులతో సంఘం నేతలు

టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్

కడ్తాల్: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఎస్ యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్ అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం కడ్తాల్ మండల పరిధి పాఠశాలల్లో ఉపాధ్యాయులతో చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం సామాజిక స్పృహ కలిగిన సంఘానికి మద్దతు ప్రకటించాలని టీచర్లను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీచర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు, హెల్త్‌కార్డు సమస్యలను పరిష్కరించాలని, డీఏలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో దశల వారీగా ఆగస్టు 1న జిల్లా కేంద్రంలో, 23న ఇందిరాపార్కు వద్ద ధర్నా, నిరసన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్, నాయకులు సత్యనారాయణ, రాజు, బీరప్ప, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్ పెంచాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్


సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

యాచారం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వికలాంగుల పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ డిమాండ్ చేశారు. యాచారం మండలం గునుగల్ గ్రామంలో సోమవారం సమితి మండల అధ్యక్షుడు మహేశ్ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, ఎంఎస్పీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికలాంగులకు రూ.6 వేలు, చేయూత పింఛన్ను రూ.4 వేలకు పెంచాలని కోరారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసి, ఎంతో మంది పేదలకు న్యాయం చేశామని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి, హామీ ప్రకారం పింఛన్ డబ్బులు పెంచాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సదరం సర్టిఫికెట్లు లేక అర్హులైన వికలాంగులకు పింఛన్ మంజూరు కావడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి, సదరం ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు జంగయ్య, వెంకటేశ్, వై.జంగయ్య, సతీష్, సుధాకర్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజావాణి’కి 119 ఫిర్యాదులు

అనంతగిరి: ప్రజావాణికి వస్తున్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 119 అర్జీలు వచ్చాయని తెలిపారు. వీటిని పెండింగ్‌లో ఉంచకుండా వెంటవెంటనే క్లియర్ చేయాలని సూచించారు. ఆర్డీఓ వాసుచంద్ర, డీఆర్ఓ శ్రీనివాస్ వినతులను స్వీకరించారు.

ఫొటో షూట్‌కు వెళ్తుండగా కారు బోల్తా

స్వల్ప గాయాలతో బయటపడిన ఫొటో, వీడియోగ్రాఫర్లు


రోడ్డుపక్కన గుంతలోకి దూసుకెళ్లిన కారు

ధారూరు: ఓ ఈవెంట్ ఫొటో షూట్‌కు వెళ్తున్న ఫొటో, వీడియో గ్రాఫర్ల కారు అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటన మండల పరిధిలోని సోమ శంకరప్ప ఆలయ రోడ్డు మలుపులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం .. హైదరాబాద్ నుంచి తాండూరుకు వెళ్తున్న ఫొటో గ్రాఫర్ల కారు శంకర్ప ఆలయ సమీపంలోని ఓ మూల మలుపు వద్దకు రాగానే తాండూరు నుంచి రెండు లారీలు వేగంగా వస్తున్నాయి. దీంతో భయంతో కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో కారు రోడ్డుకు కుడివైపు ఉన్న గుంతలోకి పడిపోయింది. అక్కడ ఫారెస్ట్ అధికారుల తవ్వించిన మట్టికుప్పలు ఉండడంతో వాహనం ఆగిపోయింది. పక్కనే ఉన్న ఆర్అండ్‌బీ హద్దురాయిని ఢీకొడితే మాత్రం ప్రమాద తీవ్రత పెరిగేదని స్థానిక సాక్షులు తెలిపారు.

కబ్జా కోరల్లో ఫిరంగి నాలా

- మధ్యలో చుట్టూ ప్రహరీల నిర్మాణం
- తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్న ఇరిగేషన్ అధికారులు
- కాలువను పునరుద్ధరించకపోవడంతో కబ్జాలకు ఊతం


మధ్యలో ఫిరంగి నాలా.. చుట్టూ ప్రహరీ నిర్మాణం

శంషాబాద్: ఫిరంగి నాలా కబ్జాదారులకు కాసులవర్షం కురిపిస్తోంది. నాలా పక్కల భూములు కొన్న యజమానులు నాలాను సైతం తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. ఎయిర్‌పోర్టు ప్రధాన రహదారికి అత్యంత సమీపంలోనే అక్రమాల పర్వాన్ని కొనసాగిస్తున్నారు. కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కి ఉనికి కోల్పోతున్న నాలాను పరిరక్షించడంలో ఇరిగేషన్ అధికారులు అనుసరిస్తున్న నిర్లక్ష్యం వీరికి వరంగా మారుతోంది.

శంషాబాద్ పట్టణంలో...

శంషాబాద్ పట్టణంలో జాతీయ రహదారికి పక్కనే ఎయిర్‌పోర్టు ప్రధాన రహదారిని ఆనుకున్న సర్వే నంబర్లు 182, 275 మధ్యలో ఫిరంగి నాలా ఉంది. ఇది పూర్తిగా చదునుగా ఉండటంతో నాలా ఉందనే విషయం కూడా కనిపించని పరిస్థితి. ఇటీవల ఇక్కడ భూములు కొనుగోలు చేసిన కొందరు యజమానులు నాలాకు రెండు వైపుల భూములు తమవే ఉండటంతో చుట్టూ ప్రీకాస్ట్‌తో ప్రహరీని నిర్మించారు. మధ్యలో ఉన్న నాలాను పూర్తిగా తవ్వించాలని ఇటీవల స్థానికులు ఇరిగేషన్ అధికారులకు విన్నవించారు.

నాలాను తవ్వితేనే

ఏడాదిన్నర క్రితం ఇక్కడే కొందరు కార్పొరేట్ స్థాయి బడాబాబులు ఏకంగా నాలాకు ఇరువైపుల ఉన్న గోడను సైతం తొలగించి మట్టితో చదును చేశారు. పదిహేను ఎకరాలకు పైగా ఇక్కడ నాలాకు ఇరువైపు కొందరు రియల్టర్లు భూములు కొనుగోలు చేశారు. భూమి చదునుగా ఉండటంతో నాలాను అమాంతం తమ భూముల్లోకి కలుపుకోవాలనే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. దీనిపై ఇరిగేషన్ అధికారులు సత్వరమే చర్యలు తీసుకుని నాలా వెడల్పుతో పాటు పొడవును పునరుద్ధరిస్తేనే సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

అధికారుల అలసత్వంతోనే..



అధికారుల అలసత్వం కారణంగానే పట్టణంలో ఫిరంగి నాలా ఆక్రమణలకు గురవుతోంది. ప్రీకాస్ట్ తొలగిస్తే సమస్య పరిష్కారం కాదు. ఇరిగేషన్ మ్యాపులో ఉన్న విధంగా నాలాను పునరుద్ధరించి బఫర్ జోన్ వరకు హద్దులు ఏర్పాటు చేస్తే నాలా పరిరక్షణ సాధ్యమవుతుంది. ఎయిర్‌పోర్టు రహదారి పక్కనున్న నాలాను అక్రమార్కులు తరచు తమ కబ్జాల్లోకి తీసుకుంటున్నారు.

– మురళి, శంషాబాద్

చర్యలు తీసుకుంటాం

నాలా పునరుద్ధరణ కోసం ప్రత్యేకంగా బడ్జెట్ పెట్టి చేయాల్సి ఉంటుంది. మధ్యలో నాలా ఉండి చుట్టుపక్కల నిర్మాణాలు చేపడితే తొలగిస్తున్నాం. ఇటీవల ప్రీకాస్ట్ వేసిన వాటిని కూడా తీయించాల్సిందిగా ఆదేశించాం. శాశ్వత నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకుంటాం.

– మౌనిక, ఏఈ, ఇరిగేషన్

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ LinkiT Aviation Academy, Begumpet - Our Courses: Aviation Tourism & Hospitality, Ground Handling, Airport Terminal Ops, Personality Development, Customer Service, Air Ticketing. Call: +91 9000030263 www.linkitaviation.com [HA-16230]

Real Estate

LEASE/SALE

■ Commercial Space–Sale/ Lease: SSS Paradigm Square, Kothaguda X Roads, 6400 Sft (2nd Flr) & 19,345 Sft (4th Flr) 8897572681 [HA-16240]

Services

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800535]

BUSINESS OFFER

■ Need Monthly Returns? Get your Own Global Market Trading Account. Profit Sharing. H/Returns Safe & Secure. 6301859174 [SCA25006634]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, H Venu Gopal, R/o Shanti Sarover, Gachibowli. I Have Changed my name From H S Venu Gopal to H Venu Gopal. As per Aadhar For All Purposes. [HA-34971]

■ I, Parelli Sandhya W/o Parelli Ravinder, H.no. 5-3-157, Rampalli, Keesara KV Rangareddy, Telangana 501301. My name wrongly mentioned in Aadhar Record as Parelli Sandhya, have changed my name to Parelli Bhagya Laxmi [SCA25006793]

■ I, Santhosh Reddy, S/o Chada Kavitha, R/o H. No. 4-60/4, Ippalagudem (V), Markook (M), Siddipet (Dist), TS - 502279, do hereby declare that Chada Kavitha Reddy & Chada Kavitha is one and the same person. [WB-16281]

■ I, Safia W/o, Abdul Aziz R/o Ho.no-20-127/1, Indra Nagar B, Behind CMR School, Gajularamaram, Qutubullapur, Medchal-Malkajgiri, Telangana-500055, have changed my name to Safiya Sulthana. [DA-44830]

OLD AGE HOME

■ వృద్ధులు, NRI'S లగ్జరీ రూమ్స్, లిఫ్ట్ @ మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్, ఉప్పల్ & చీర్యాల్. మీన్స్ భోజన వసతి. 7981467036, 939103 9990, 6281125552 [H-783379]

Wanted

■ క్విక్ జాబ్స్: రిసెప్షనిస్ట్, టి.కా., క్యాషియర్, డి.ఎంట్రీ, కం.ఆపరేటర్, ఫార్మా, షాపింగ్ మాల్, హెల్పర్స్, సె.గార్డ్, సూ॥వై., జీ॥ 15–35K ఫ్రీ రూం+మీల్స్. 7989824632 [SCA25006785]

■ క్రాంతి రోడ్ ట్రాన్స్‌పోర్ట్ HYD ఆటో నగర్ ఆఫీస్ నందు గుమాస్తాలుగా పని చేయుటకు 10th ఆపై చదివి 30 సం॥ లోపు వయస్సు గల మేల్ అభ్యర్థులు కావలెను. బ్యాచిలర్స్‌కు వసతి సౌకర్యం కలదు. సంప్ర: Ph No: 87901 91999 [B-1]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ : 18K. Ph: 9848571888, 9640400073 [SCA25006687]

■ ఫ్రీ ట్రైనింగ్: వీ॥ఎడిటింగ్, న్యూస్ రీ॥, యాంకర్స్, రిపోర్టర్, కెమెరామెన్ కోర్స్. 45/90 డేస్ M/F. పా/ఫు టైం, వ-16–55, జీ:12–30K. రూం+మీల్స్. 9505251777 [SCA25006784]

■ 30 to 70 yrs బ్యాంకు అనుబంధ సంస్థలో జీతం ఇన్సెంటివ్స్ 35 వేలు (మేనేజర్స్, టీం లీడర్స్ ఎగ్జిక్యూటివ్స్) Q: 10th/డిగ్రీ రిటైర్డ్, బిజినెస్, టీచర్స్, ఇన్సూరెన్స్ ఏజెంట్, రియల్ ఎస్టేట్, గృహిణి, మార్కెటింగ్ ✆ 90524 70111 [B-197]

■ Wanted Business Operation Manager & Tellecallers Age: 35 to 45. Salary. 55,000 Contact. svgemsand jewellers. 9966709787, 9100522814 [HA-82483]

■ Nampally, Malakpet, Hayat nagar, Jublihills areas Require Security Guards, No consultancy 9700746126, Malakpet [SCA25006606]

FACULTY TEACHERS

■ Wanted Female Teachers High School : English Physics. Lower class. Maths, Floor Incharge KPHB :9032858238, 8790757788 [HA-34957]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — సాక్షి క్లాసిఫైడ్స్

3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు), ప్రతి అదనపు లైనుకు రూ. 540/-
గమనిక : ఇక్కడ మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

జోన్ సెంటర్స్

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453